
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# డిసిసి అధ్యక్షులంతా నా టీమ్..

అనంతగిరి వేదికగా పార్టీ సారథులకు

రాహుల్ భరోసా



రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న సిఎం రేవంత్, డిసిఎం భట్టి విక్రమార్క,



- సింప్లిసిటీతో ఉండండి - గాంధీగిరి చేద్దాం
- భవిష్యత్తు అంతా మనదే : రాహుల్
- ఉల్లాసంగా ముగిసిన కాంగ్రెస్ శిక్షణా శిబిరం
- వికారాబాద్‌కు దక్కిన అరుదైన గౌరవం
- రెండు వారాలుగా విఐపిల తాకిడి
- ఊపిరి పీల్చుకున్న పోలీసులు





వికారాబాద్‌లో జరిగిన తెలంగాణ, ఎపి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్, ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు. స్వాగతం పలుకుతున్న గీతారెడ్డి, మహేందర్‌రెడ్డి





పార్టీ అగ్రనేతకు పూల మొక్క ఇచ్చి స్వాగతిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ అనన్య

(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)

ఏఐసీసీ నిర్వహించిన 10 రోజుల శిక్షణ శిబిరం ఆఖరి రోజు డిసిసి అధ్యక్షులందరిలో నూతనోత్తేజం కలిగించింది. సోమవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలు అంతా సింప్లిసిటీతో ఉండాలని రాహుల్ పిలుపునిచ్చారు. గాంధీ విధానమే మన విధానం అంటూ గాంధీ గిరీ పాటించాలని పరోక్షంగా దిశానిర్దేశం చేశారు. పార్టీకి డిసిసి అధ్యక్షులు సుప్రీం అని అభివర్ణిస్తూ డిసిసి అధ్యక్షులంతా తన టీం అని భరోసా నింపారు. భవిష్యత్తు అంతా మనదే అని రాహుల్ గాంధీ వివరించారు. అనంతరం కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్‌గాంధీతో పాటు సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, కెసి వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షినటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎపి పిసిసి చీఫ్ షర్మిల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యమన్నారు. దేశం కోసమైనా రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజా సమస్యలపై గళం విప్పిన తనపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. అనంతరం ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు.

**నిష్ణాతులైన శిక్షకులతో ..**

వికారాబాద్ చరిత్రలో లేని విధంగా ఓ జాతీయ పార్టీ కార్యక్రమాలు ఏకధాటిగా నిర్వహించడం విశేషం. సామాన్య ప్రజలకు కాస్త అసౌకర్యం కలిగినా జాతీయ స్థాయిలో వికారాబాద్ పేరు మారుమోగింది. సంఘటన సృజన్ అభియాన్ పేరిట డీసీసీ అధ్యక్షులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. మేధోమదనం తర్వాత కర్ణాటకకు చెందిన సచిన్‌రావు ఈ కార్యక్రమ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏపీ ఇన్చార్జ్ వైయస్ షర్మిల, డీప్యూటీ భట్టి విక్రమార్క, ఏఐసీసీ ముఖ్యనేతలు, మం త్రులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 70 మంది డీసీసీ అధ్యక్షులు శిబిరంలో పాల్గొన్నారు. కఠినమైన నిబంధనలు అమలు చేయడమే కాకుండా నిష్ణాతులైన శిక్షకులు, రాజకీయ ప్రముఖుల ద్వారా 22 అంశాలపై గంటల తరబడి అవగాహన పెంపొందించారు. రెండుసార్లు వారిని పలు గ్రామాలకు తీసుకువెళ్లి ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయించారు. వర్ధమాన రాజకీయాలు, కులం, మతం, సామాజిక అంశాలపైనే కాకుండా ప్రభుత్వ పథకాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు తెన్నులు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, గాంధీజీ చరకాపై అవగాహన తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు.

**గతానికి భిన్నంగా..**

గతంలో కాంగ్రెస్ పార్టీతో పోల్చుకుంటే ప్రస్తుతం చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పట్లో మితిమీరిన స్వేచ్ఛ, ఆధిపత్యపోరు, ఫ్లెక్సీల గోల, దాడులు, గొడవలు, ఈలలు వంటి కార్యకలాపాలతో విసిగెత్తిపోయారు. ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థల్లో ఇచ్చే శిక్షణ మాదిరిగా కాంగ్రెస్ కూడా ఇలాంటి కార్యక్రమాలను రూపొందించడం మీనాక్షి నటరాజన్ వంటి అంకితభావం గల లీడర్లకే సాధ్యమని అంటున్నారు. ఏఐసీసీ, పీసీసీలలో కూడా ఎన్నో మార్పులు కనిపిస్తున్నాయని తెలుస్తున్నది. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి, ప్రభుత్వ సారథి మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేనందున శిబిరం సజావుగా సాగిందని చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మిగతా 3లో

---

## కొండంత ఆశతో వస్తున్నారు

### ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సింది మీరే

### ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త** : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక హౌసింగ్ డిపార్ట్మెంట్‌కు అత్యధికంగా 53 దరఖాస్తులు అందాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలకు సంబంధించి 153 దరఖాస్తులు అందినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణిలో ఇన్‌చార్జి డిఆర్ఓ చంద్రావతితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రజల నుంచి ధరఖాస్తులు, ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు అత్యధికంగా 53 దరఖాస్తులు అందినట్లు, మిగతావి వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 153 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దరఖాస్తులు చేసుకోవటానికి వస్తారని, ఎంతో వ్యయ ప్రయాసాలకు ఓర్చి వారి సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతో అధికారుల వద్దకు ప్రజలు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన అవసరం బాధ్యత అధికారులపై ఉందన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా ఆర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.

స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా సంబంధిత వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దివంగత స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త** : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో దివంగత స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో దివంగత స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని అధికారికంగ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాసనసభాపతి పదవికి వన్నె తెచ్చిన మహానీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో విశిష్ట పాత్రను పోషించారని గుర్తు చేశారు. ప్రభుత్వం శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని అధికారికంగ జయంతిని నిర్వహించటం గౌరవించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ఇన్‌చార్జి డిఆర్ఓ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న జిల్లా అధికారులు

## ప్రాసెసింగ్ ఫీజు భారం కావద్దు

- సిబిల్ స్కోర్ పరిగణలోకి తీసుకోకండి
- పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలి
- బ్యాంకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

3




## ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వండి

### కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

3



## చిన్నారులకు ప్రాణదాతలుగా మారండి

### రక్తదాన శిబిరంలో అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్

**ఇబ్రహీంపట్నం, మార్చి 2, ప్రభాతవార్త** : ఇబ్రహీంపట్నం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తలసేమియా వంటి జెనెటిక్ డిసార్డర్‌తో మిగతా 2లో

---

## ప్రజాహితం కోసం / నడుం బిగించండి

### యువతకు ఎంపి డాక్టర్ కోవ లక్ష్మణ్ పిలుపు



ఘట్‌కేసర్‌లో లాల్‌బహదూర్ స్మారక యువజన సంఘం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాజ్యసభసభ్యులు లక్ష్మణ్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు-బిజెపి ఓబిసిమోర్చ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కోవ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో నూతనంగా నిర్మించిన లాల్‌బహదూర్ స్మారక యువజన సంఘం భవనాన్ని ఎంపీ డాక్టర్ కోవ లక్ష్మణ్, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. రైల్వేగేటు వద్ద ఉన్న సంఘం పాత భవనం తొలగించి ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే మల్లారెడ్డి దాతల సహకారంతో నూతనంగా భవనం నిర్మించారు. భవనంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు రిబ్బన్ కత్తిరించి కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. సంఘం అధ్యక్షులు సి.బ్రహ్మం, గౌరవ చైర్మన్ బండారి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. నిర్వహకులు విచ్చేసిన ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే మల్లారెడ్డిలను శాలువా, పూలదండల, జ్ఞాపికలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ ఎల్‌బి క్లబ్ సేవాభావంతో చేపడుతున్న కార్యక్రమాలకు సహకారం ఉంటుందన్నారు. గురుకుల్ భూములు ఎంతో విలువైనవి ఆర్యసమాజ్ ట్రస్ట్‌తో చర్చించి భూముల పరిరక్షణతో పాటు అవసరమైన అభివృద్ధి చేసేందుకు ఎలాంటి బేధాలు లేకుండా పని చేయాలని, యువతకు నైపుణ్యత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఘట్‌కేసర్ యువకులు మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేవిధంగా నాయకులు తమ వంతు సహకారం ఉండాలని సూచించారు. యువత దేశానికి వెన్నెముక అని విదేశీ సంస్కృతికి అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసవుతున్న యువత మేలుకొని తమ కుటుంబాన్ని సరిగా పోషించుకోవాలని సాంప్రదాయ ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని పిజ్జా, బర్గర్‌లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ లాల్‌బహదూర్ సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. రైల్వేవంతెన పెండింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయించి బిల్లులు మంజూరు చేసేందుకు సీఎంతో చర్చించేందుకు జేఏసీ సభ్యులను తీసుకువెళ్లామని తెలిపారు. ఘట్‌కేసర్‌లో 1952లో స్థాపించిన ఎల్‌బి సంఘం సభ్యులు తమ సమాజ హితం కోసం పాటుపడుతున్నారని ఆయన కితాబిచ్చారు. ఈకార్యక్రమంలో సీఎంఆర్ హెల్త్ సిటి చైర్మన్ డాక్టర్ చామకూర భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

## క్షుణ్ణంగా పరిశీలించండి

### ప్రజా వినతుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త** : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజావాణి సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్ఓ మంగీలాల్, డిఆర్డిఏ శ్రీనివాస్ లు (85) అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో అధి కంగా రెవెన్యూ, హౌసింగ్, భూమి సర్వే, రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ప్రజావాణిలో పలు సమస్యలపై స్పందిస్తూ, గ్రామాల్లో డంపింగ్ యార్డ్, మిగతా 2లో

---

# 164 ఎకరాలపై కన్ను

## రూ.150 కోట్ల విలువైన అసైన్డ్ భూమి స్వాహాకు స్కెచ్



వికారాబాద్ మండలంలో కొంతమంది రియల్టర్లు బరితెగిస్తున్నారు. రాజకీయ నాయకుల అండతో పేదలు బతికేందుకు ఇచ్చిన అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయటానికి చూస్తున్నారు. ఓ బడా బాబు దీనిపై కన్నేసి స్వాహా చేయటానికి రంగం సిద్ధం చేశారు. కోట్లలో విలువ చేసే కొటాలగూడ గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిని హస్తగతం చేసుకోవటానికి ఓ రియల్టర్ చేస్తున్న నప్రయత్నాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.




ఐర్యా కంపెనీ పేరిట అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు

**వికారాబాద్, మార్చి 2, ప్రభాతవార్త** : వికారాబాద్ మండలం కొటాలగూడ గ్రామ పరిధిలోని సిద్దులూరు పాయగా 176 సర్వే నెంబరులో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. ఇందులో భూమిలేని నిరుపేదలకు సాగు లేదా నివాసం కోసం దాదాపు 147 మంది దళిత, గిరిజన రైతులకు పంపిణీ చేయగా, పదవీ విరమణ పొందిన 10 మంది మాజీ సైనికులకు 36 ఎకరాలతోపాటు సర్వే నెంబరు 90లో కూడా 20 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. సైనికులకు ఎన్‌ఓసీ పత్రాల ద్వారా పూర్తి యాజమాన్య హక్కులు కూడా రావడంతో నగరానికి చెందిన రియల్ వ్యాపారులకు తమ స్థలాలను విక్రయించారు. ఆ తర్వాత మాజీ సైనికులు అమ్మిన 56 ఎకరాల భూమి చేతులు మారుతూ వచ్చింది. ఈ క్రమంలో ఓ బడా వ్యాపారి సదరు స్థలాన్ని కొనుగోలు చేశాడు. అది చాలదన్నట్లు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. కొంతమంది స్థానిక నాయకుల అండదండలతో అసైన్డ్ పట్టాలు పొందిన రైతులను బెదిరించి, మాజీ సైనికులకు ఇవ్వగా మిగిలిన 164 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశా డు. గట్టిగా మాట్లాడిన రైతులకు తోచిన కాడికి మిగతా 2లో

### అక్రమ నిర్మాణాలు మా పరిధిలోకి రావు: ఎంపిడివో

సిద్దులూరు పాయగ పరిధిలో ఐర్య కంపెనీ చేపడుతున్న నిర్మాణాలు తమ పరిధిలోకి రావని, 6 నెలల క్రితమే హెచ్ఎండీఏ పరిధిలోకి వెళ్లిందని ఎంపీడీఓ వినయ్‌కుమార్ వివరణ ఇచ్చారు. హెచ్ఎండీ అధికారులు క్షేత్ర స్థాయిలో వచ్చి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే..అప్పుడు వారికి సహకరిస్తామని తెలిపారు.

- సిద్దులూరుపాయగాలో ఓ రియల్టర్ దందా
- ఆక్రమిత స్థలంలో ఐర్యా కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు
- అనుమతులు ఇవ్వకున్నా అడ్డగోలుగా నిర్మాణాలు
- పొలిటికల్ లీడర్ల అండతో యథేచ్ఛగా అన్యాక్రాంతం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- లబోదిబో అంటున్న పేదలు



| | |
|---|---|
| Application Details | |
| File No. | 004735/HMDA/0141/SWBP/SKP2/2025 |
| Applicant Name | IRYA HOTELS AND RESORTS |
| Architect Name | M MAHESH |
| Status | Rejected |

ఐర్యా కంపెనీ నిర్మాణానికి అనుమతులు నిరాకరించినట్లు సంబంధిత శాఖ అధికారులు జారీ చేసిన పత్రం

### మా దృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఐర్యా కంపెనీకి సంబంధించిన నిర్వాహకులు మాజీ సైనికులకు సంబంధించిన భూములను కొనుగోలు చేశారు. దాని పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో రైతులే సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్టు మా దృష్టికి వస్తే బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ వివరణ ఇచ్చారు.

## గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**మొయినాబాద్, మార్చి 2, ప్రభాతవార్త :** రెడ్డిపల్లి గ్రామాభివృద్ధిలో తన వంతు కృషి నిరంతరం కృషి ఉంటుందని ఇది... గ్రామస్థులతోనే సహకారమని రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ షాపురం మాణ్యం (రాజు) తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో బాగంగా గ్రామంలో పుట్టిన ఆడబిడ్డలకు తన అమ్మ పుణ్యవతి పేరిట రూ.11000 నగదు అందచేస్తానని ఇచ్చిన హామీని ఆయన కొనసాగిస్తున్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామం లోని ఎర్రరోహిణి, అనిల్ దంపతులకు ఆడబిడ్డ జన్మించడంతో ఆయన సోమవారం వాళ్ల ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామాభివృద్ధికి తన నిరంతర కృషి కొనసాగిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో సర్పంచిగా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ఆపదలో అండగా ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గడిగె గజేందర్ గౌడ్

**షాబాద్, మార్చి 2, ప్రభాతవార్త :** ప్రభుత్వం రైతుల వద్ద మొక్క జొన్నలు మూడు నెలల క్రితం కొనుగోలు చేసి ఇప్పటి వరకు డబ్బులు రాలేదని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంఘం మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం రైతుల వద్ద మొక్కజొన్నలు మూడు నెలల క్రితం ఖరీదు చేసి ఇప్పటి వరకు డబ్బులు రైతులకు ఇవ్వకపోవడం విడ్డురంగా ఉందన్నారు. పంటను అమ్ముకున్న రైతులు డబ్బులు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అఖిల భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ సమావేశాలు ఘట్కేసర్లో జరిగాయని, ఈ సమావేశంలో రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిపెట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయంతోనే పంట దిగుబడి పెరిగి అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయకార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రయ్య, వెంకట్ రెడ్డి, వీరేశం, రైతులు పాల్గొన్నారు.

## పనులు ఆగకుండా చూడండి




గ్రామ సర్పంచ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

**షాబాద్, మార్చి 2, ప్రభాతవార్త:** మహిళా సంఘం భవన నిర్మాణం విషయంలో ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దవీడు గ్రామ సర్పంచ్ సులోచనకు మహిళా సంఘాల సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ భవన నిర్మాణం పనులకు ఆటంకాలు కలిగిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ వ్యవహారం విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు ఆగకుండా చూడాలని సర్పంచ్, కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

## యువతి చికిత్సకు ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో తోపుడుబండిపై కూరగాయలు అమ్ముకునే మహిళ సునీత కూతురు స్వప్న మెదడులో రక్తం గడ్డ కట్టడంతో చికిత్స కోసం సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. స్వప్నకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించగా నయం కాకపోవడంతో బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. తండ్రి సెంట్రింగ్



ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కూలీగా పనిచేస్తుండగా తల్లి కూరగాయాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ కూతురుకు వైద్యం చేయించడానికి ఇప్పటి వరకు రూ.40 వేలు ఖర్చు చేశారు. మందుల ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు సన్‌రైజ్ ట్రస్ట్ సభ్యులు-మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్‌ను ఆశ్రయించారు. ఈమేరకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేల చెక్కును ఆదివారం అందజేశారు. ఈకార్యక్రమంలో యల్లంరాజు సుందర్ రావు, మోపర్తి శ్రీకాంత్, దేశబోయిన ఐలయ్య, సన్నిదానం వెంకటేశ్వర్లు, ఆల్వా వీరారెడ్డి, మొత్కూరి శరబంధ, తలబోయిన కృష్ణ, నాగెల్లి రామయ్య, అవ్వారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్‌లు వెంటనే చెల్లించాలి

### విశ్రాంత ఉద్యోగుల డిమాండ్

**షాద్ నగర్ టౌన్, మార్చి 2, ప్రభాతవార్త :** ఇంద్రాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్ల, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన మహా ధర్నాలో బీజేపీ నేతలు, విశ్రాంత ఉద్యోగులు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి వెంకట్ రమణ రెడ్డి ఎమ్మెల్యే స్వయంగా దీక్షలో కూర్చొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొన్నారు. ధర్నాలో మహేశ్వర్ రెడ్డి(బీజేపీ ఫ్లోర్ లీడర్), రాకేష్ రెడ్డి మ్మెల్యే, ఎంఎల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర మోళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అన్యాయం జరిగితే స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా స్విచ్ చంద్రశేఖర రావు ప్రభుత్వం 317 వంటి జీఓలను తీసుకువచ్చి అన్యాయం చేసిందని విమర్శించారు.



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ఆశించిన ఉద్యోగులు, రెండు సంవత్సరాలుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలువురు మానసిక ఒత్తిడితో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్ట కట్టలేదని హెచ్చరించిన ఆయన, రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగులు దాచుకున్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకుల కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధన వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమములో రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మందికి పైగా విశ్రాంత ఉద్యోగులు హాజరై సంఘీభావం తెలిపారు. బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షులంతా నా టీమ్..




(మొదటి పేజీ తరువాయి)

మధ్య సమన్వయం కుదురడం వల్ల పార్టీ పట్టాలపై పరిగెత్తుతున్నదని, తమ రాష్ట్రంలో కూడా అధికారంలోకి రావాలని ఏపీకి చెందిన ఓ డీసీసీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. శిబిరంలో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉదయం పూట యోగా, మెడిటేషన్, వార్మింగ్ అప్‌కు వెళుతూ నిర్ణీత సమయంలో తరగతులకు కూడా హాజరైనారు. ఇప్పటి వరకు 95 శాతం మంది శిబిరం విడిచి వెళ్లలేదని సమాచారం. ఒకరిద్దరు అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా వెళ్లినా అదే రోజు సాయంత్రానికి శిబిరానికి చేరుకున్నారు. మంచి భోజన వసతులు, అత్యవసర వైద్యసేవలు, అందుబాటులో వైద్య సిబ్బంది, అంబులెన్స్ సదుపాయాలు కల్పించారు. మద్యపాన నిషేధం అమలును డీసీసీ అధ్యక్షులు స్వాగతించారు. శిబిరం ప్రారంభం కంటే వారం రోజుల ముందు నుంచీ వీఐపీలు అనంతగిరి సందర్శన చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. మీడియాకు అనుమతించకున్నా కీలకమైన అంశాలను పార్టీవర్గాల ద్వారా బహిర్గతమైనాయి.

జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా నేతృత్వంలో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. సీఎం పర్యటన మొదలకుని రాహుల్‌గాంధీ పర్యటన వరకు పగడ్బంధీగా చేపట్టారు. ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు విధుల నిర్వహణ, పాస్‌ల పర్యవేక్షణ, హెలిప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎస్పీ పనితీరు పట్ల సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏదేమైనా రెండు వారాల పాటు సాగిన కాంగ్రెస్ శిబిరం ప్రశాంతంగా ముగిడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

**డిసిసి అధ్యక్షుడి కారులో రాహుల్ ప్రయాణం**

డిసిసి అధ్యక్షుడి కారులో రాహుల్, రేవంత్ ప్రయాణం వికారాబాద్ వచ్చిన రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హెలిప్యాడ్ నుంచి అనంతగిరి శిబిరం వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్ కారు లో ప్రయాణించారు. శిబిరం ముగిసిన తర్వాత సాయంత్రం కూడా ఇదే కారులో హెలిప్యాడ్ వరకు ప్రయాణించడం విశేషం. ఇది తనకు దక్కిన గౌరవం గా భావిస్తున్నట్లు ధారాసింగ్ సంతోషం వ్యక్తం చేశారు

## ఘట్‌కేసర్‌లో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం

### -500 మందికి వైద్య పరీక్షలు..మందుల పంపిణీ

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** ప్రజలకు చౌకగా, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మల్లారెడ్డి సేవా ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, గురుకుల్ మైదానంలో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. ఘట్‌కేసర్‌కు చెందిన మదనగిరి అనుష్‌గౌడ్ సౌజన్యంతో రెండు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా పెద్దసంఖ్యలో వచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద 280 మంది, గురుకుల్ మైదానంలో 220 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మొత్తం 80 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి బిపి పరీక్ష చేయించుకొని శిబిరాన్ని సందర్శించి రోగులకు మందులను అందజేశారు. మల్లారెడ్డి ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన చికిత్స ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా నిర్వహకులు ఆయనను శాలువాతో



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

సన్మానించారు. ఈకార్యక్రమంలో సిఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ డాక్టర్ చామకూర భద్రారెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, నాగులపల్లి రమేశ్, గడ్డిఅన్నారం ఎఎంసీ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్, బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, షేక్‌జహంగీర్, బేతాల నర్సింగ్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్లు సార శ్రీనివాస్‌గౌడ్, డొంకెన బిక్షపతిగౌడ్, మాజీ డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కాలేరు రామోజీ, సామల సందీప్‌రెడ్డి, రొద్ద యాదగిరి, అల్లు కమలాకర్, పల్లె విజయ్‌గౌడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్సీడీలపై రైతులకు డ్రిప్ పరికరాలు

### డ్రిప్పు మరియు స్ప్రింకలర్‌ల పైన అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమల శాఖ అధికారి ఎం.ఏ సత్తార్

**మోమిన్‌పేట్, మార్చి 2, ప్రభాతవార్త:** బావులు బోర్లు కలిగిన రైతులు తమ పొలాలలో కూరగాయల పంటలు సాగు చేసుకుంటే ప్రభుత్వం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సబ్సీడీలపై డ్రిప్ పరికరాలను అందజేస్తుందని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.ఏ సత్తార్ పేర్కొన్నారు. సోమవారం వెల్‌చాల్ గ్రామంలో రకరకాల ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతు ఎండీ ఇబ్రహీం పొలంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు హాజారైన వెల్‌చాల్, దుర్గంచెర్వు రైతులను ఉద్దేశించి మాట్లాడారు మరియు ఉద్యానశాఖ జిల్లాలో అమలుచేస్తున్న వివిధ పథకాలపై రైతులకు సబ్సీడిపె డ్రిప్పు 90శాతం మరియు స్ప్రింకలర్ సబ్సీడి 75శాతంతో రైతులకు


రైతులతో కలిసి పొలంలో తిరిగి పరిశీలిస్తున్న అధికారులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి సత్తార్

అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్‌చాల్ సర్పంచ్ శ్రీనివాస్,దుర్గంచెర్వు సర్పంచ్ లావణ్య మోహన్, రైతులు రఘురాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శివన్న, రమేష్ పటేల్, పాండు, నరహరి, శివకుమార్, సత్యనారాయణ, ప్రభు స్వామి, అనంత్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు హెచ్ ఓ అక్షిత రెడ్డి, హెచ్ ఓ కమల, కొఠారి కంపెనీ మేనేజర్ రవికాంత్ మరియు వివిధ డ్రిప్ కంపెనీల డీసిఓలు, డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ శాఖలకు ఇచ్చే రుణాలకు ప్రాసెసింగ్ ఫీజు భారం కావద్దు

**..మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**
**..కలెక్టరేట్‌లో జరిగిన డిసిసి (బ్యాంకర్స్) సమావేశం**
**..జిల్లా వార్షిక ప్రణాళిక 2025-26లో ఆర్థిక సంవత్సరంలో**
**రూ.28160.71 లక్ష్యానికి రూ.24900.93కోట్లకు చేరిన వైనం**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన డిసిసి బ్యాంకర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,బ్యాంకర్స్ దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 2, ప్రభాతవార్త**

సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణాలకు సిబిఎల్ స్కోర్ పరిగణలోకి తీసుకోకుండా, ప్రాసెసింగ్ ఫీజు నామమాత్రంగ ఉండేలా చూడాలని బ్యాంకర్స్‌కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో ఏర్పాటు చేసిన డిసిసి బ్యాంకర్స్ సమావేశం జరిగింది. దీనిలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు ఆర్‌బిఐ డిజిఎం, నాబార్డు జిఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టె ప్రతి పథకం ద్వారా నిరుపేదలు ఉపయోగించుకునేలా బ్యాంకు అధికారులు వారికి పూర్తి అవగాహన కల్పించటమే కాకుండ వారికి అవసరమైన మార్గనిర్దేశం అందించాలని సూచించారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు అందించే రుణాలను కాలయాపన లేకుండ నిర్ణీత గడువులోగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాంటివి తన దృష్టికి తీసుకరావాలని ఆయన సూచించారు. రుణాలు తీసుకున్న లబ్దిదారులు సకాలంలో చెల్లించటం లేదని, సిబిల్ స్కోర్ పెరగటంతో పాటు భవిషత్‌లో సులభతరంగా మరిన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టె పథకాలను బ్యాంకుల ద్వారా పేద వర్గాల ప్రజలకు అందించి వారి ఆర్థికాభివృద్దికి దోహదపడాలని, అందుకు బ్యాంకర్లు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా వార్షిక ప్రణాళిక 2025-26ఆర్థిక సంవత్సరంలో రూ.28160.71కోట్లు లక్ష్యాలకు గాను రూ.24900.93కోట్లకు చేరుకున్నట్లు బ్యాంకర్లు వివరించారు. వాటిని పూర్తి చేయటమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక (పిఎల్‌పి) 2026-27సంవత్సరానికి ప్రణాళిక పుస్తకంను విడుదల చేశారు. ఈ ప్రణాళిక ద్వారా మొత్తం రూ.33,229.71కోట్ల లక్ష్యంగా నిర్దేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలు సూచించారు. ప్రాధాన్యత రంగంలో విద్యా రుణాలు, రుణ మెరుగుదల, సిడి నిష్పత్తి 60శాతం కంటే తక్కువగా సాధించకపోవటం గురించి ఎస్ఎల్‌బిసి, ఆర్‌బిఐకి నివేదించి, ఆ బ్యాంకర్లకు తెలియజేసి సమాధానం పొందాలన్నారు. ఈ సమస్యపై సరైన చర్యల కోసం రాష్ట్ర నియంత్రణ సమావేశాల కోసం ఎస్ఎల్‌బిసి,ఆర్‌బిఐకి కూడ తెలియజేయాలని, పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై 60శాతం కంటే ఎక్కువ సాదించాలని అన్ని బ్యాంకులు తెలియజేయబడినట్లు తెలిపారు. బ్యాంకులు నూతన శాఖలు కొత్త ప్రారంభానికి స్థానిక ప్రజా అవగాహన కోసం, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా గిరిజన అధికారి పద్మజా, వివిధ బ్యాంకుల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకత ఆలోచనలకు పదును

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 2, ప్రభాతవార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి ఇన్నోక్వెస్ట్ ముగింపు వేడుకలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం డీన్ ప్రోగ్రామ్ చైర్ డాక్టర్ జి. విష్ణుమూర్తి మాట్లాడుతూ పరిశ్రమ విద్యారంగాల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించే దిశగా ఇన్నోక్వెస్ట్ వేదిక నిలిచనట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 170 జట్లు, 579 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకత ఆలోచనలను ప్రదర్శించినట్లు తెలిపారు. మైక్రోసాఫ్ట్ నిపుణులు, ప్రాజెక్టుల ఆవిష్కరణ వినియోగిత, విస్తరణ సామర్థ్యం వంటి ప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం చేశారు. విజేత జట్లకు ప్రథమ బహుమతి పదివేలు, ద్వితీయ, తృతీయ బహుమతి ఐదు వేలరూపాయల చొప్పున అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఆవిష్కరణాత్మక ఆలోచనలు హ్యాకథాన్ విజయానికి బాసలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ నిపుణులు భూపేంద్ర సాహూ, జయేశ్‌తల్సానియా రవిముక్కవిల్లి, ప్రోగ్రాం కన్వీనర్లు ఎస్. దీపిక, రవీందర్‌రావు, దుర్గాభవాని పాల్గొన్నారు.



ఇన్నోక్వెస్ట్ ముగింపువేడుకల్లో విజేతలకు ప్రశంశా పత్రాలు అందజేస్తున్న కళాశాల డీన్ జి. విష్ణుమూర్తి.

## ఆర్ఓబి, ఎఫ్ఓబి, ఎంఎంటిఎస్ ట్రిప్పుల పెంపుకు వినతి

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ప్రజలకు అవసరమైన రైల్వే అభివృద్ధి పనులు చేపట్టాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి సోమవారం దక్షణమధ్య రైల్వే డిప్యూటి జనరల్ మేనేజర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సుదర్శన్‌రెడ్డి రైల్వే డిజిఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి మూడు పనులపై వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ లెవెల్ క్రాసింగ్ నెం: 17ఈ వద్ద గేటు మూసి వేయడం కారణంగా ట్రాఫిక్ సమస్య ఉంటుందని, ప్రజలు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైల్వేగేటుపై రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు ఎంఎంటిఎస్ సేవలను విస్తరించడంతో పాటు అదనపు ట్రిప్పులనఉ ప్రవేశపెట్టడం



రైల్వే డిజిఎంకు వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ద్వారా ప్రయాణికులకు ప్రయోజనం కల్గుతుందని తెలిపారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద ఎస్కలేటర్‌తో కూడిన ఫుట్‌ఓవర్ వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు పట్టాలు దాటే ప్రయత్నంలో ప్రమాదాల భారిన పడుతున్నారని, ఘట్‌కేసర్ ప్రాంత ప్రజల సౌకర్యం, భద్రత కోసం ఈమూడు పనులు చేపట్టాలని సుదర్శన్‌రెడ్డి, ఆర్‌డిజిఎంను కోరారు. ఈమేరకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ద్వారా ప్రతిపాదిక పనులకు సిఫారులు చేయాలని అందించిన లేఖను సుదర్శన్‌రెడ్డి రైల్వే డిజిఎం కిరణ్‌కుమార్‌కు అందజేశారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే శంకర్

## మానవ సమాజ నిర్మాణంలో సైన్స్ పాత్ర ముఖ్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ రూరల్, మార్చి 2, ప్రభాతవార్త :** మానవ సమాజ నిర్మాణంలో జన్యుశాస్త్రం పాత్ర ప్రత్యేకమైనదని, ఈ విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పద్మావతి కాలనీ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోసం నూతనంగా ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్ ను షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ స్థానిక కౌన్సిలర్ పెంటయ్య, ఎంఈఓ మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యమ్మలతో కలసి ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. అనంతరం విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాష్ రూం లను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో పాఠశాల విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలు ఎంతో మెరుగ్గా ఉన్నాయని ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కౌన్సిలరు దిలీప్, మురళీ మోహన్ (అప్పి)సాధిక్, ముబారక్ అలీ ఖాన్, అనిల్,చందు,ఖదీర్ ప్రదీప్ ముదిరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో మహిళా సమాఖ్య భవనం స్లాబ్ నిర్మాణానికి పూజలు చేసిన సర్పంచ్.

## మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

**మహిళా సమాఖ్య భవన స్లాబ్ నిర్మాణానికి సర్పంచ్ పూజలు**

**నందిగామ, ఫిబ్రవరి 2 ,ప్రభాతవార్త:** మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు తీసుకెళ్లి వారిని కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు. సోమవారం నందిగామ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడి, మహిళా సమాఖ్య భవన నిర్మాణం స్లాబ్ కు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నిర్మిస్తున్న ప్రగతి భవనాలకు ప్రజలు చేయూతనందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సి నర్సింలు,ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్, శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, చించేటి లత శివగౌడ్, టైలర్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

## 20లోపు ఇంటి పన్నులు వసూలు చేయాలి

**ఎంపిడిఓ పాండు**

**పూడూరు, మార్చి 2, ప్రభాతవార్త :** ఇంటి పన్నులను ఈనెల 20వతేదిలోపల వసూలు చేయాలని ఎంపిడిఓ పాండు పేర్కొన్నారు.సోమవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులను తప్పకుండా వసూలు చేయాలని సూచించారు.ఉపాధిహామీ పనులను వేగవంతం చేసి కూలీలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో మంజూరి అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను త్వరలో పూర్తిచేయించాలని,లబ్దిదారులకు మరుగుదొడ్లు మంజూరికోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.మార్చి తరువాత కొత్తగా మరిన్ని ఇండ్లు మంజూరిఅయ్యే అవకాశం ఉందని వివరించారు.గ్రామాల్లోని పంటపొలాల్లో ఉన్న వ్యవసాయ బావులు,బోరుబావులను సర్వే చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిఓ సుందర్,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీతో ప్రయాణించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్ యాదవ్

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త :** ఏఐసిసి ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీతో ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావల్‌కోల్ గ్రామానికి చెందిన ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్ యాదవ్ కలిశాడు. రాష్ట్రానికి విచ్చేసిన రాహుల్‌గాంధీతో ఆయన ఢిల్లీ నుండి హైదరాబాద్ వరకు విమానంలో ప్రయాణించానని ఈ సందర్భంగా రాహుల్ యాదవ్ తెలిపాడు. రాహుల్ గాంధీతో కలిసి విమానంలో ప్రయాణించడం ఆనందంగా ఉందని అన్నాడు.



రాహుల్ గాంధీతో రాహుల్ యాదవ్

## సాకేత్ ప్రణామం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నూతన డైరెక్టర్ల ఎంపిక

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి గ్రామ శివారులోని సాకేత్ ప్రణామం అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ నూతన డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అసోసియేషన్‌లో ఖాళీగా ఉన్న మూడు డైరెక్టర్ల స్థానాలకు సోమవారం సాకేత్ వెల్‌నెస్ హబ్‌లో ఎన్నికలు నిర్వహించగా కేతినేడి రామ్మోహనరావు, వల్లూరి వరప్రసాద రావు, వాత్సవాయి రామకృష్ణలు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ చైర్మన్‌గా కేతినేడి రామ్మోహనరావు పేరును ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అపార్ట్‌మెంట్స్ సంక్షేమం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా ప్రభులింగం వ్యవహరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.



సాకేత్ ప్రణామం అసోసియేషన్‌కు నూతనంగా ఎంపికైన డైరెక్టర్లు

## నేషనల్ సేఫ్టీ డే సెలబ్రేషన్స్

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త :** మేడ్చల్ పారిశ్రామిక వాడలోని సర్వోత్తం కంపనీ ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ సేఫ్టీ డే సెలబ్రేషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ కార్మికులు పారిశ్రామికవాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ప్రేంకుమార్ పాండే, అంబదాస్, దీప్‌చంద్, మోహన్‌కుమార్ , కార్మికులు పాల్గొన్నారు.



మేడ్చల్ పారిశ్రామిక వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్వోత్తం కంపెనీ కార్మికులు

## చేవెళ్ల నూతన ఆర్డీవోగా పార్థసింహారెడ్డి

**ఆర్డీవో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ జాతీయ నాయకులు**

**చేవెళ్ల, మార్చి 2, ప్రభాతవార్త :** చేవెళ్ల నూతన ఆర్డిఓ గా వచ్చిన పార్థసింహారెడ్డిని ఈరోజు సిపిఐ పార్టీ నాయకులు కలిసి పూల బొకేను ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె రామస్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు భారతరాజు నరసింహ సిపిఐ జిల్లా సమితి సభ్యులు దత్తు నాయక్ కే చంద్ర యాదవ్ సక్రు నాయక్ మంజుల ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ గిరిజన రైతులు శంకర్ నాయక్ వెంకటేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో దృష్టికి మోకిలా గ్రామానికి చెందిన రైతుల సమస్యను ఆర్డీవోకి వివరించారు. పొన్నగట్టు తాండ రైతులకు ఐదు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నది ప్రభుత్వం ల్యాండ్ పోలింగ్ ద్వారా ఆ ల్యాండ్‌ను తీసుకున్నది ఎకరాకు 800 గజాల తరఫున ఐదు ఎకరాలకు 4000 గజాలు గిరిజన రైతులకు రావాలి, కానీ వీరికి ఇవ్వకుండా బోగస్ పేర్లను చేర్చి గిరిజన రైతులకు అన్యాయం చేయాలని చూసిన అధికారులపై మరియు దొంగ పేర్లు ఉన్న వారిపై చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.



ఆర్డీవోను సన్మానిస్తున్న సిపిఐ నాయకులు

## మల్లన్న, బీరప్ప గుడి అభివృద్ధికి విరాళాలు

**చేవెళ్ల, మార్చి 2, ప్రభాతవార్త :** చేవెళ్ల మండలంలోని నాంచేరి గ్రామంలో మల్లన్న, బీరప్ప గుడి అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చారు. చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు, 12వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి మనిషా అనంతరెడ్డి రూ.51 వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి నిధికి అందజేశారు. అలాగే చేవెళ్ల మాజీ ఎంపీపీ మల్ గారి విజయలక్ష్మి రమణారెడ్డి, డా. వైభవ్ రెడ్డి రూ.51 వేల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను గ్రామస్తులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, దాతలు ఇదే విధంగా సహకరించాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

# ఘనంగా మల్లన్న జాతర

## పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని సోమారం గ్రామంలో మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవంలో స్వామి వారి కళ్యాణం, అగ్ని గుండాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు భోనాల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, నాయకులు దయానంద్ యాదవ్, దర్శన్, నవీన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, యూనుస్ పాష, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




2ఎండిసి03: మల్లన్న స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## అభివృద్దే ఎజెండా ..!

**-- పార్టీలకు అతీతంగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**
**-- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**
**-- అట్టహాసంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ**

**తాండూరు, మార్చి 2, ప్రభాతవార్త :** పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్దే ఎజెండాగా పనిచేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మున్సిపల్ పాలకవర్గానికి సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తాండూరుకు అధిక నిధులు తీసుకువచ్చి రూపురేఖలు మార్చేవిధంగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. సోమవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్‌గా పట్లోళ్ల నీరజ, వైస్ చైర్‌పర్సన్‌గా అబ్దుల్ రజాక్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే సమక్షంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎన్ని కుట్రలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి మెజార్టీతో గెలిపించారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలకవర్గం ప్రజలకు సేవలందించాలని సూచించారు. తాండూరు పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా తాండూరు ప్రజలకు కాగ్నా నీటి సరఫరా చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అమృత్2.0 కింద పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత రెండున్నరేళ్లలో ఎమ్మెల్యేగా ప్రజలకు ఇచ్చిన హామీల కంటే చేసిన అభివృద్దే ప్రజల ముందు కనిపిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి.. విజన్ 2028 నాటికి తాండూరు రూపురేఖలు మార్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి పరుస్తామని, ఏ వార్డుపై సవతి ప్రేమ చూపించబోమని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా మాట్లాడుతూ.. సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరును అభివృద్ధి చేయడమే పట్టుదలగా భావిస్తామని తెలిపారు. గతంలో ఉన్న పాలకవర్గంతో ప్రజలు విసిగి పోయారని, కొట్లాటలే తప్ప అభివృద్దిని విస్మరించారని అన్నారు. అందరు అధికారులు, కౌన్సిలర్లతో కలిసి పటణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, మాజీ డిసిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నీరజా.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**కొడంగల్ రూరల్, మార్చి 2 (ప్రభాతవార్త):** కొడంగల్ మండల పరిధిలోని హుసేన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయుడు ఇల్లూరి క్రాంతికుమార్ ఆధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ అంజిలయ్య, టీపీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఎంపీవో జైపాల్‌రెడి ప్రధానోపాధ్యాయులు రాజరత్నం, వెంకటేశ్, నర్సిములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య, పంచాయతీ కార్యదర్శి కొండన్న, డేవిడ్, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు

## ఘనంగా ఎన్ జె యశస్వి స్మారక ఉపన్యాసం




**శంకర్‌పల్లి, మార్చి 2, ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని ఐ సి ఎఫ్ ఏ ఐ విశ్వవిద్యాలయం 14వ ఎన్ జె యశస్వి స్మారక ఉపన్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అకాడమీ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, సౌత్ ఆసియా బోర్డు చైర్మన్ మరియు ఐ ఐ ఎమ్ బెంగళూరులో మాజీ డీన్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథ్ పాల్గొని మాట్లాడారు. లెగసీ లీడర్‌షిప్ బిల్డింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ దట్ ట్రాన్స్‌ఫార్మ్ సొసైటీ అనే అంశంపై ప్రసంగించారు. విద్య రంగానికి యశస్వి చేసిన సేవలను గుర్తు చేస్తూ అందరికి నాణ్యమైన విద్యని అందించేందుకై ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏ ఐ ద్వారా రూపొందించబడిన మారుతున్న ప్రపంచం గురించి డాక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ, వేగంగా విశ్లేషించి ప్రాసెస్ చేయగల యుగంలో, మానవుల నైతికత ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. సృజనాత్మకత, ఊహ మరియు వ్యక్తిత్వం భవిష్యత్తును నిర్వచిస్తాయని ఆయన అన్నారు. ఎన్.జె. యసస్వి వారసత్వం నుండి ప్రేరణ పొంది, విద్యార్థులు మరియు విద్యావేత్తలు ప్రభావాన్ని సృష్టించడంపై దృష్టి పెట్టాలని కోరారు. వైస్ ఛాన్సలర్ (ఇంచార్జ్) డాక్టర్ టి. కోటి రెడ్డి తన స్వాగత ప్రసంగంలో, ఎన్.జె. యసస్వి జీవితం మరియు వారసత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్ శోభారాణి యశస్వి, ప్రెసిడెంట్ శ్రీ వీ ఆర్ శంకర, మాజీ ఉప కులపతి మరియు విశిష్ట సలహాదారు డాక్టర్ మహేందర్ రెడ్డి, సలహాదారు టీపీ దాస్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ జే యశస్వి స్మారకపోనస కార్యక్రమం దృశ్యం




ఫిజియోథెరప్పీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

### రోగులకు నాణ్యమైన థెరపి సేవలు అందించాలి

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** రోగులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రి పక్కన మమత ఫిజియో క్లినిక్‌ను ప్రారంభించారు. ఫిజియోథెరపిస్ట్ మమతా వినోద్ ఆధ్వర్యంలలో ఇక్కడ ఫిజియో క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేసి సెంటర్‌ను ప్రారంభించారు. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేయగా నిర్వహకులు వారిని శాలువాలతో సన్మానించి మిఠాయిలు అందజేశారు. వివిధ రకాల నొప్పి నివారణ, ఫిజియో థెరప్పీ సేవలు ఇక్కడ అందు బాటులో ఉన్నాయని వినియోగించు కోవాలని వైద్యురాలు మమత సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ ఎంపిటిసి నందం గణేశ్‌బాబు, మాజీ కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి మహి పాల్‌గౌడ్, కొమ్మిడి అనురాధ, కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, సొసైటీ మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మాజీ డైరక్టర్లు చందుపట్ల ధర్మారెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, విఏఎస్ బొమ్మగోని ప్రవీణ్‌గౌడ్, నాయకులు పింగల్‌రెడ్డి, శ్యామ్‌గౌడ్, బర్ల రాధాకృష్ణ, పల్లె విజయ్‌గౌడ్, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

**ఘట్‌కేసర్, మార్చి 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో సోమవారం ఎంఎంసి పారిశుద్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 92 మంది కార్మికులకు బట్టలను అందజేశారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన మదనగిరి అనుష్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తుల వితరణ చేశారు. అనుష్‌గౌడ్ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలకు ఉచిత వైద్య శిబిరంతో పాటు నిత్యం చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుద్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి-బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనుష్‌గౌడ్

## హోలీ రోజున వైన్ షాపులు మూసివేత

**-ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు బంద్ అనిఆదేశాలు**

**రంగారెడ్డి అర్బన్,మార్చి 2,ప్రభాతవార్త:** హోలీ పండుగ సందర్భంగా నగరంలో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు,కల్లు దుకాణాలు (టాడీ షాపులు), రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు 3 మార్చి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలో నడిచే బార్లకు ఈ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేశారు.పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు, నిఘా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.ప్రజల భద్రత దృష్ట్యా తెలంగాణ ఎక్సైజ్ చట్టం - 1968 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.హోలీ పండుగను సోదరభావంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.



సిపి సుధీర్‌బాబు

## టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ

**దౌల్తాబాద్,మార్చి 2,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలం చెల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న పదోవతరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ రోజరమేష్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు కోలుముల రాజు టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు.ఈ సంధర్భంగా సర్పంచ్ రోజరమేష్ మాట్లాడుతూ..'విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి,గ్రామానికి మంచి పేరు తీసుకురావలని ఆకాంక్షించారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జామ్ ప్యాడ్లను అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

## ఆపదలో ఉన్న పేదలకు సిఎం సహాయనిధి వరం

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, మార్చి 2, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న నిరుపేద ప్రజల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండల కేంద్రానికి చెందిన దొబ్బల రాములు అనారోగ్య సమస్యతో బాధపడుతూ అత్యవసర చికిత్స నిమిత్తం నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. రాములుకు గుండె సంబంధిత ఆపరేషన్‌కు దాదాపుగా 3 లక్షల రూపాయలు ఖర్చవుతుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రాములు కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో కలవగా ఆయన సిఎం సహాయ నిధి నుంచి రెండు లక్షల 50 వేల రూపాయల విలువగల ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌ఓసి నిధులతో రాములుకు గుండె సంబంధిత చికిత్స విజయవంతంగా పూర్తి అయింది. లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్‌కు, అందుకు సహకరించిన గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, రమణ గౌడ్, లబ్ధిదారు కుటుంబ సభ్యుడు దొబ్బల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## సిఎం గడపలోనే సవతి తల్లి ప్రేమ..

**-నిధుల కేటాయింపులో వివక్షపై ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా**

**దౌల్తాబాద్,మార్చి 2,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలో అభివృద్ధి పనుల నిధుల కేటాయింపు రాజకీయ రంగు పులుముకుంది.మండలంలో మొత్తం 33 పంచాయతీలు ఉండగా,అందులో 23 మంది కాంగ్రెస్ సర్పంచ్‌లు,10 మంది బీఆర్ఎస్ సర్పంచ్‌లు ఉన్నారు.అయితే రాజకీయ కారణాలతో 10 మంది బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు గల గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ సర్పంచులు మండల నాయకులతో కలిసి సోమవారంరోజు ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.ఈ సంధర్భంగా మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి,మాజీ జడ్పిటిసి కోట్ల మహిపాల్ మాట్లాడుతూ.."ముఖ్యమంత్రి నియోజకవర్గంలో అందరూ సమానమే కావాలి,కానీ ఇక్కడ కాంగ్రెస్ సర్పంచుల గ్రామాలకు నిధులు కుమ్మరిస్తూ,బీఆర్ఎస్ సర్పంచ్‌ల గ్రామాలను పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.సిఎం సొంత గడపలోనే "సవతి తల్లి" ప్రేమ చూపించడం తగదని అన్నారు.వెంటనే నిధులు విడుదల చేయాలని,లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు.అనంతరం మండల ఎంపిడిఒ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు,మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు,నాయకులు

## నూతన్‌కల్ గ్రామ వైకుంఠదామంలో నీటి సమస్య పరిష్కారం

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ పరిధి నూతనకల్ గ్రామంలోని దోబీ ఘాట్, వైకుంఠధామంలోని స్నానాల గదుల్లో నెలకొన్న నీటి సమస్యను మున్సిపల్ కౌన్సిలర్లు పరిష్కరించారు. రెండు సంవత్సరాలుగా నీరు రాక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్న విషయాన్ని ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు సురేష్‌రెడ్డి, భాస్కర్‌లు గుర్తించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సహకారంతో పాతబోర్ మోటర్‌ను రిపేర్ చేయించి సంపులో నూతన మోటార్‌ను బిగించి, పైపు లైన్, నల్లాలు వేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో దోబీ ఘాట్‌కు, వైకుంఠదామానికి నీటి సమస్యను తీర్చి స్నానాల గదులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా కౌన్సిలర్లు తెలిపారు. కాగా గ్రామ సమస్యను పరిష్కరించేందుకు కౌన్సిలర్లు చేసిన కృషి అభినందనీయమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూనుస్ పాషా, జీవన్, మహేందర్ రెడ్డి, సుదర్శన్, అనీఫ్, భూషణం దాస్, సురేష్ చారి, వీరస్వామి, రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వైకుంఠదామంలో వస్తున్న నీటి వద్ద మున్సిపల్ కౌన్సిలర్లు